క్లుప్తంగా

టార్పాలిన్ల పంపిణీ



వర్ని: మండలంలోని సేవాలాల్ తండా, బెల్యా నాయక్ తండాలో పాత ఇళ్లల్లోకి పైకప్పు నుంచి వర్షపు నీరు పడకుండా కాంగ్రెస్ నాయకులు శనివారం టార్పాలిన్ కవర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీ డెలిగేట్ గంగా ప్రసాద్, నాయకులు రమేష్, ముత్యాల కష్ణ, గంగప్ప, పీర్య, జంపాల రామకష్ణ, బీమా శంకర్, చక్రధర్, రవి ముక్తార్, బషీర్, సలీం పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి



వర్ని(మోస్రా): హరితహారం కార్యక్రమంలో మోస్రాలో శనివారం లయన్స్ క్లబ్ సభ్యులు మొక్కలు నాటారు. ప్రభుత్వం చేపట్టిన హరిత హారం స్ఫూర్తితో ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు శ్రీకాంత్, లక్ష్మీ నరసయ్య, ప్రమోద్ పాల్గొన్నారు.

కాంప్లెక్స్ నిర్మాణ పనుల పరిశీలన



రుద్రూర్: మండల కేంద్రమైన రుద్రూర్‌లో నిర్మిస్తున్న మండల కాంప్లెక్స్ పనులను శనివారం జెడ్పీటీసీ నరోజి గంగారాం పరిశీలించారు. రూ. కోటి ఖర్చుతో చేపట్టిన పనులు ఆఖరు దశకు చేరుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ సంజీవ్ రెడ్డి, రైతు బంధు మండల అధ్యక్షుడు తోట సంగయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పత్తి లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ఈత మొక్కల పెంపకంతో లాభాలు



రుద్రూర్: స్వచ్ఛమైన కల్లు కోసం ఈత మొక్కలు విరివిగా నాటాలని బోధన్ ఎక్సైజ్ సీఐ రూప్‌సింగ్ అన్నారు. పోతంగల్ మండలం జల్లాపల్లి శివారులో శనివారం హరిత హారం కార్యక్రమంలో భాగంగా ఈత మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని వినియోగించుకుని అభివృద్ధి చెందాలని సూచించారు. చెరువు గట్లు, సొంత పొలాల్లో ఈత మొక్కలు నాటి లాభాలు పొందాలని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గీతా పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ. విఠల్ గౌడ్, బోధన్ ఎక్సైజ్ ఎస్సై సీహెచ్ బాలయ్య, సిబ్బంది సంతోష్, సంజయ్, ప్రమోద్, నాగరాజు, జి.నాగరాజ్ గౌడ్, గీత కార్మికులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇళ్లు నిర్మించాలి



ఎడపల్లి: మండలంలోని అంబం(వై) గ్రామంలో దివ్యాంగుల ఇళ్లను వీహెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్యవంశీ పరిశీలించారు. వర్షాల వల్ల దివ్యాంగుల ఇళ్లు కూలిపోయిన విషయాన్ని తెలుసుకొని శనివారం ఆమె బాధితులతో మాట్లాడారు. 15 ఇళ్లు కోల్పోయిన బాధితులకు పునరావాసం కల్పించాలని సర్పంచ్‌ను కోరినా ఎలాంటి చరయలు తీసుకోలేదన్నారు. బాధితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు.

శాంతి భద్రతలకు సహకరించాలి



నందిపేట్: శాంతి భద్రతలకు స్థానికులు సహకరించాలని ఎస్సై రాహుల్ కోరారు. శనివారం బాధ్యతలను స్వీకరణ అనంతరం ఆయన మాట్లాడుతూ నందిపేట్, డొంకేశ్వర్ మండలాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారి సమాచారాన్ని ఇవ్వాలని కోరారు.

కోమట్‌పల్లి చెరువుకు బుంగ



డొంకేశ్వర్: మండల పరిధిలోని కోమట్‌పల్లి ఊర చెరువుకు బుంగ ఏర్పడింది. దీంతో గత రెండు రోజులుగా చెరువులోకి వచ్చిన వరద నీరంతా వృథాగా పోతుంది. బుంగ ద్వారా చేపలు కూడా వెళ్లడంతో మత్స్యకారులు ఉపాధిని కోల్పోతున్నారు. ఇరిగేషన్ అధికారులు వచ్చి చూసినప్పటికీ ఇంత వరకు మరమ్మతు చర్యలు చేపట్టలేదు. బుంగను త్వరగా పూడ్చాలని గ్రామ సర్పంచ్ నాగరాజు అధికారులను కోరుతున్నారు.

దారులకు కోత



తెగిన రెంజర్లలో పొలాలకు వెళ్లే దారి

- పొలాలకు వెళ్లే అవకాశం లేక ఆందోళనలో రైతులు

బాల్కొండ: అధిక వర్షాల వలన ప్రధానరహదారులే కాదు, పంట భూములకు వెళ్లే దారులకు పెద్ద పెద్ద గండ్లు ఏర్పాడ్డాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్త చేస్తున్నారు.ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామంలో ప్రధాన రోడ్డు రెండు చోట్ల భారీ గండి ఏర్పాడింది. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది భారీ వర్షాల వలన గండి ఏర్పాడటంతో పెద్ద పై పైపులు వేసి మొరం వేసి రోడ్డుకుమరమ్మత్తులుచేపట్టారు. ప్రస్తుత సంవత్సరం క్క వానాకే కొట్టుకు పోయింది. దీంతో 600 ఎకరాలకు దారి లేకుండ పోయింది. కాకతీయ కాలువ పై పంపు సెట్లు ఉండటంతో నిత్యం రైతులు విద్యుత్తు మోటర్లు ఆన్ చేయుటకు కాకతీయ కాలువకు వెళ్తారు. రోడ్డుకు రెండు చోట్లగండి ఏర్పాడటంతో రైతులు వెళ్లాలంటే జంకుతున్నారు. గతంలోనే ఎకరానికి 2 వేల రూపాయాల చొప్పున ఖర్చు చేసి రోడ్డుకు మరమ్మతు చేపట్టారు. ప్రస్తుతం గండి ఏర్పాడటంతో మళ్లీ రోడ్డు మరమ్మత్తుకు డబ్బులు ఎక్కడి నుంచి పెట్టాలని రైతులు వాపోతున్నారు. పాలకులు, ఉన్నత అధికారులు స్పందించి తెగిపోయిన రోడ్లు మరమ్మత్తులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఉమ్మడి బాల్కొండ మండలంలో పలు గ్రామాల్లో పంట భూములకు వెళ్లే దారులకు గండి పడింది. వర్షపు నీటితో కోతకు గురికావడం వలన రోడ్లు తెగిపోయాయి. ప్రభుత్వం స్పందించి మరమ్మత్తులుచేపట్టాలని వేడుకుంటున్నారు.

ఏటా ఇదే పరిస్థితి



వర్షాలు కురిసిన ప్రతి ఏటా ఇదే పరిస్థితి కలుగుతుంది. రోడ్డు పూర్తిగా ధ్వంసంపై పెద్ద గండి ఏర్పాడింది. పొలాలకు వెళ్లలంటే తిప్పలు తప్పడం లేదు. రోడ్డుకు రెండుచోట్ల పై గండి ఏర్పాడింది.

– చిన్నారెడ్డి, రైతు, రెంజర్ల

ఏడాదిక్రితం పైపులు వేశాం



ఏడాది క్రితం పెద్ద వానాలుకురువడంతో గండి ఏర్పాడింది. వెంటనే పైపులు వేసి మరమ్మత్తులు చేశాం. కాని మళ్లీ అదేచోట పెద్ద గండిఏర్పాడింది. ఏటా ఖర్చు పెట్టి చేయాలంటే ఇబ్బందిగా ఉంది. ప్రభుత్వం స్పందించి రోడ్డు మరమ్మత్తులకునిధులు మంజూరు చేయాలి.

– లింబన్న, రైతు, శెట్‌పల్లి

అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆరోపణలు



మాట్లాడుతున్న సర్పంచ్ పోశన్న

డొంకేశ్వర్(ఆర్మూర్): మండలంలోని అన్నారం గ్రామంలో చేస్తున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే ఎంపీటీసీ సంజీవ్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని సర్పంచ్ మంగ్లారం పోశన్న పేర్కొన్నారు. శనివారం ఆయన పంచాయతీ కార్యాయలంలో పాలకవర్గంతో కలిసి విలేకరుల సమావేశం మాట్లాడుతూ పాలకవర్గంపై అనవసరమైన ఆరోపణలు చేయడం తగదన్నారు. ఉపాధిహామీ నిధులు పంచాయతీ ఖాతాలో ఉంటే దుర్వినియోగం ఎలా అవుతాయని ప్రశ్నించారు. స్మశాన వాటిక, డంపింగ్ యార్డు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులు నిర్మించడంతో పాటు ఆహ్లాదకరంగా పల్లె ప్రకృతి వనాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ లావణ్య, వార్డు సభ్యులు లక్ష్మణ్, సత్తెమ్మ, ముత్తెన్న, సునిత, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పనులు పూర్తయ్యే వరకు దీక్షలు కొనసాగిస్తాం



రిలే దీక్షలో కూర్చున్న గౌడ సంఘం నాయకులు

రెంజల్(బోధన్): రెంజల్‌లోని లింకు రోడ్లను పూర్తి చేసే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని రైతులు స్పష్టం చేశారు. ముందస్తు ప్రణాళిక ప్రకారం కుల సంఘాల అద్వర్యంలో దీక్షలు చేపడుతున్నట్లు నిర్వాహకులు బుజ్జి, చుక్కరాజుగౌడ్‌లు పేర్కొన్నారు. శనివారం గౌడ సంఘం అద్వర్యంలో దీక్షలను కొనసాగించారు. రెంజల్ నుండి ఎడపల్లి మండలం బ్రహ్మణపల్లి గ్రామం వరకు గల బందల్ల రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని కోరుతు రైతులు గాంధీ విగ్రహం ముందు చేపట్టిన రిలే నిరాహర దీక్షలు 32 రోజులకు చేరుకున్నాయి. దీక్షలో గౌడ సంఘం ప్రతినిధులు సుక్క గంగాగౌడ్, సాయిబాబగౌడ్, సాయాగౌడ్, గంగాధర్‌గౌడ్, హన్మాండ్లుగౌడ్, మహేశ్‌గౌడ్, రాజాగౌడ్, కృష్ణాగౌడ్, లక్ష్మాగౌడ్‌లతో పాటు రైతులు కటికెల శ్రీనివాస్, అమ్రాది వెంకటి, కొండల్‌వాడీ శ్రీను, లోలపు ఓడ్డెన్న, హన్మాండ్లు, దేశపేట్ పోశెట్టి, ఈర్ల రంజిత్, రాకేశ్‌రెడ్డి, మెట్టు రంజిత్, అన్నం పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సహాయం



కొత్తపల్లిలో బాధితురాలు లక్ష్మికి సరుకులు పంపిణీ చేస్తున్న బీజేపీ నాయకుడు రాకేష్‌రెడ్డి



గాంధీనగర్‌లో నిరాశ్రయులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాక్లూర్: వర్షాల కారణంగా సర్వం కోల్పోయిన వారికి ఆర్మూర్ నియోజకవర్గ బీజేపీ నాయకుడు పైడి రాకేష్‌రెడ్డి, ఆయన కుమార్తె పైడి సుచరిత ఆర్థిక సహాయంతో పాటు నిత్యావసర సకులు అందజేశారు. శనివారం వారు మాక్లూర్, కొత్తపల్లి పర్యటించారు. కొత్తపల్లిలో ఇల్లు కూలిపోయిన సింగాని లక్ష్మితో పాటు బొంకన్‌పల్లిలో మరో బాధితురాలికి ఆర్థిక సహాయం అందజేశారు. మాణిక్‌భండార్, అమ్రాద్ తండాల్లోని పొలాలను పరిశీలించారు.బీజేపీ నాయకులు నూతుల శ్రీనివాస్, రోహిత్ రెడ్డి, సాయరెడ్డి, గంగోనే సంతోష్, సురేష్‌నాయక్, గంగారెడ్డి ఉన్నారు.

కమ్మర్‌పల్లి: వర్షాల కారణంగా నష్టపోయిన మండలంలోని గాంధీనగర్‌కు చెందిన పలు కుటుంబాలకు కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు బాధితులకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుంకేట రవి, పాలేపు నర్సయ్య, బుచ్చి మల్లయ్య, సింగిరెడ్డి శేఖర్, బుచ్చన్న, నాగులు, కృష్ణ, అశోక్, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం పండుగ



ఆర్మూర్‌లో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు



రెంజల్ మండలం బోర్గాం గ్రామంలో..

ఆర్మూర్‌టౌన్: మొహర్రం సందర్భంగా ఆర్మూర్‌లోని తుర్బాద్ గుహలో కర్వాల, అలిఅబ్బాస్ పీర్లను సూర్యవంశ ఆరెకటిక సంఘం ఆధ్వర్యంలో శనివారం ఊరేగించారు. గోలబంగ్లా ప్రాంతంలో బాజన్న దర్గాలో భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ప్రకాష్, మదేష్,శ్రీనివాస్, ఈశ్వర్, సుమాన్, బబ్లు, విజయ్, బొండ్ల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో మొహర్రం పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మతాలకు అతీతంగా పండుగను ఘనంగా నిర్వహించారు.

రెంజల్(బోధన్): రెంజల్, బోర్గాం, సాటాపూర్, వీరన్నగుట్ట గ్రామాల్లో మొహర్రం పండగ సందర్భంగా పీర్లను ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.

బోధన్‌టౌన్: బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్, ఆచన్‌పల్లి, పాన్‌గల్లీ, చెక్కిక్యాంప్ కాలనీలో ఏర్పాటు చేసిన పీరీలకు వారం రోజులుగా ప్రత్యేక పూజలు చేశారు. శనివారం భక్తులు పీరీలను ఊరేగించారు. అనంతరం భక్తులు చెక్కెర, బెల్లం పంచి మొక్కులు తీర్చుకున్నారు.



బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలో..



మోర్తాడ్ మండలం తిమ్మాపూర్‌లో..

ఇళ్ల కోసం అర్హుల జాబితా విడుదల

కమ్మర్‌పల్లి: మండల కేంద్రమైన కమ్మర్‌పల్లిలో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్ల కోసం అర్హుల జాబితాను రెవెన్యూ అధికారులు శనివారం విడుదల చేశారు. మొదటి విడతగా ఇప్పటికే 47 మంది జాబితా విడుదల చేయగా వీటిపై వచ్చిన అభ్యంతరాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి 24 మంది అర్హులుగా గుర్తించారు. జాబితాను గ్రామ పంచాయతీ, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లోనిని నోటీస్ బోర్డులో అందుబాటులో ఉంచారు. వీటిపైనా అభ్యంతరాలుంటే సోమవారం లోగా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని తహసీల్దార్ సురేష్‌కుమార్ తెలిపారు. జాబితాలోని అర్హులను లక్కీ డ్రా ద్వారా త్వరలో ఎంపిక చేస్తామని తహసీల్దార్ వెల్లడించారు.

కుల సంఘ భవనాలకు నిధులు మంజూరు




వేల్పూర్: మండలంలోని వివిధ గ్రామాలలో 26 కుల సంఘాల భవనాలకు రూ.1.50 కోట్లు మంజూరయ్యాయి. ఈ మేరకు శనివారం మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి స్థానిక క్యాంపు కార్యాలయంలో నిధుల మంజూరు ప్రతిని సంఘ నాయకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భీమజమున, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎడ్ల రాజేశ్వర్‌రెడ్డి, మిట్టపల్లి మహిపాల్, పెద్ద మల్లారెడ్డి, రేగుల్లరాములు, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో పీఎం కిసాన్ నిధులు

డొంకేశ్వర్(ఆర్మూర్): రైతుల బ్యాంకు ఖాతాల్లో 14వ విడత ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి డబ్బులు జమ అవుతున్నాయి. జిల్లాలో 1.17,446 మంది రైతులు ఈ పథకానికి అర్హులున్నారు. ఒక్కో రైతుకు రూ.2వేల చొప్పున రూ.23.48కోట్లు అవసరం కానున్నాయి. అయితే, జిల్లాలో ఇప్పటి వరకు ఎంత మంది ఖాతాల్లో జమయ్యాయో వ్యవసాయ శాఖకు వివరాలు అందలేదు. పంటలు సాగు చేసే రైతులకు కేంద్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తున్న విషయం తెలిసిందే.

చెక్కుల పంపిణీ



రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ గ్రామంలో పలువురు లబ్దిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను సర్పంచ్ ఖార్‌పాష అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అహ్మద్, బీఆర్ఎస్ నాయకులు సాయిలు, హాజీఖాన్, చంద్రశేఖర్‌రావ్, భూమేష్, నరేష్, సురేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలోని పలువురి లబ్దిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను కౌన్సిలర్ ఆకుల రాము అందజేశారు.

నేరాల నియంత్రణలో ప్రజలే కీలకం



బోధన్‌టౌన్: నేరాల నియంత్రణలో ప్రజలే కీలకం అని బోధన్ ఏసీపీ విజయ్ సారథి అన్నారు. శనివారం ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శాంతి భద్రలకు విఘాతం కల్గిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బోధన్‌లో నెలకొన్న ట్రాఫిక్‌ను నియంత్రణకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి



సాక్షి, నెట్‌వర్క్: ఉద్యోగ భద్రత కల్పించే వరకు విధుల్లో చేరం అని పంచాయతీ కార్మికులు పేర్కొన్నారు. డిమాండ్ల సాధన కోసం 24 రోజులుగా సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. రుద్రూర్‌లో కూలీలతో పారిశుధ్య పనులు చేయిస్తుండటంతో కార్మికులు అడ్డుకున్నారు. బోధన్‌లో సీపీఎం నాయకుడు యేశాల గంగాధర్ కార్మికులకు మద్దతు తెలిపారు. వర్నిలో కార్మికులు చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపారు.

ఆధ్యాత్మిక నగరి బోధన్

- కాశీ పీఠ జగద్గురువు చంద్రశేఖర్ మహాస్వామి



కాశీ పూర్వ పీఠాధిపతి వీరభద్రస్వామి చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న చంద్రశేఖర్ స్వామి

బోధన్: బోధన్ ఎన్నో విశేష విశిష్టత చరిత్ర కలిగిన బాగ్యనగరమని, ఆధ్యాత్మికంగా ఎంతో గొప్ప వైభవం ఉన్న ప్రాంతమని కాశీ పీఠ జగద్గురువు డాక్టర్ చంద్రశేఖర్ శివాచార్య మహాస్వామి అన్నారు. ఏకచక్రనగరం, బహుధాన్యపురం, అమరావతి ఇలా అనేక చారిత్రిక నామాలున్నాయని పేర్కొన్నారు. త్రేతాయుగంలో పరుశురాముడు ఇక్కడే తపస్సు చేసి చక్రేశ్వరుడిగా పిలువబడుతున్న శివలింగాన్ని ప్రతిష్టించారని, ప్రజలను పట్టి పీడించిన రాక్షసుడు బకాసురుడిని పాండువుల్లో ఒక్కరై భీముడు సంహరించాడని గుర్తు చేశారు. బోధన్‌లో జంగమ సమాజ్‌లో జన్మించిన వీరభద్ర స్వామి 80వ జగద్గురువుగా కాశీపీఠం అధిష్టించారని తెలిపారు. దేశంలో పంచ శైవ పీఠాల్లో కాశీ మహాపీఠం సర్వశ్రేష్టమైనదన్నారు. వీరశైవ ధర్మ ప్రచారం, లోకకల్యాణార్థం వీరశైవ లింగాయత్, జంగమ సమాజ్ జిల్లా కమిటీల అధ్వర్యంలో శనివారం పట్టణ శివారులో అధిక శ్రావణ మాస సంచార తపోనుష్టాన ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన కాశీ పీఠ జగద్గురువు ప్రవచనాలు చేశారు. వీరశైవ ధర్మ రక్షణ మనందరి కర్తవ్యమని మహారాష్ట్ర ప్రాంత బార్సీ మఠాధిపతి గురుసిద్ద మణికంఠ శివాచార్య మహారాజ్ బోధించారు.ధర్మబద్ద జీవనంతోనే సర్వ దుఃఖాలు దూరమవుతాయన్నారు. కామారెడ్డి జిలాల కౌలాస్ మఠాధిపతి బస్వలింగ్ శివాచార్యులు, హనేగాం మఠాధిపతి శంకర్‌లింగ్ శివాచార్యులు ప్రవచనాలు చేశారు.

వైభవంగా శివలింగార్చన

ఆధ్యాత్మిక కార్యక్రమంలో కాశీ జగద్గురువు భక్తులచే శివలింగార్చన చేయించారు. అనంతరం కాశీ పూర్వ పీఠాధిపతి వీరభద్రస్వామి చిత్రపటాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ఉమ్మడి జిల్లా నుంచి వీరశైవులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సమాజ్‌ల ప్రతినిధులు వీఆర్ దేశాయ్, శ్యాంరావు, ఎస్ .దిగంబర్‌రావు, అజయ్ వడియార్, శివకుమార్ అప్ప, నర్సింగ్ అప్ప, బాబయ్యప్ప, కైలాస్ అప్ప, యాదవరావు, లక్ష్మణ్ పటేల్, కామారెడ్డి జిల్లా అధ్యక్షుడు కందారే దిగంబర్‌రావు పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డీ మోహన్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సునీతాదేశాయ్, డీసీసీబీ డైరెక్టర్ శరత్, బీఆర్ఎస్ నాయకుడు బుద్దె రాజేశ్వర్ తదితరులు చంద్రశేఖర్ మహాస్వామిని దర్శించుకున్నారు.

రైతులను ఆదుకోవాలి



భీమ్‌గల్‌లో నీట మునిగిన పొలాలను పరిశీలిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మోహన్ రెడ్డి



హున్సలో బాధితులతో మాట్లాడుతున్న బీజేపీ కార్యవర్గ సభ్యుడు వడ్డీ మోహన్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి

భీమ్‌గల్: వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ. 25 వేలు, పొలాల్లో ఇసుక మేటలు కట్టిన రైతులకు ఎకరానికి రూ. 50 వేలు నష్ట పరిహారం చెల్లించాలని పీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వర్షాల కారణంగా నీట మునిగిన పంట పొలాలను శనివారం ఆయన పరిశీలించారు. వేల్పూర్ మండలం సుంకెట్‌లో రెండు వాగులు కలిసే దగ్గర, భీమ్‌గల్, అక్లూర్‌లో మలుపుల వద్ద చెక్‌డ్యాం నిర్మించడం వల్ల వర్షాల సమయంలో అవి ఏవిధంగా బలపడతాయో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. నాయకులు బొదిరె స్వామి, వేణు రాజ్, యూత్ కాంగ్రెస్ నాగేంద్ర పాల్గొన్నారు.

పెర్కిట్(ఆర్మూర్): మండలం గోవింద్‌పేట్‌లో నీట మునిగిన పొలాలను రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లెపు వెంకటేష్ పరిశీలించారు. మొక్క జొన్న, సోయా సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు భూమన్న, రవి, గంగాధర్, మల్లయ్య పాల్గొన్నారు.

మాక్లూర్: రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుడ్డు గంగాధర్ డిమాండ్ చేశారు. మానిక్‌భండార్‌లో నీట మునిగిన పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకులు పురం లక్ష్మణ్, పెంటగాడి నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: వర్షాల కారణంగా నష్టపోయిన రైతులు, ఇళ్లు కోల్పోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్ రెడ్డి, మేడపాటి ప్రకాష్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సాలూర మండలంలోని హున్స, మందర్న గ్రామాల్లో వారు పర్యటించారు.

ఎడపల్లి: మండలంలోని ఏఆర్పీ క్యాంప్, బ్రాహ్మణపల్లి గ్రామాల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డీ మోహన్ రెడ్డి, మేడపాటి ప్రకాష్ రెడ్డి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడారు. బాధతులను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఆర్మూర్: వర్షాల కారణంగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు ప్రబాకర్ డిమాండ్ చేశారు. స్థానిక కుమార్ నారాయణ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి దేవరాంతో కలిసి మీడియాతో మాట్లాడుతూ రైతులకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. సమావేశంలో నాయకులు సురేష్, ముత్తన్న, గంగన్న, కిషన్, రాజన్న, దుర్గా ప్రసాద్, అనిల్ కుమార్, రమేష్, రవి పాల్గొన్నారు.



ఆర్మూర్: గోవింద్‌పేట్‌లో మునిగిన పొలాలను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు



మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు ప్రభాకర్

లంబాడీలను అవమానిస్తే ఊరుకోం

బోధన్‌టౌన్: లాంబాడాలను అవమానించే విధంగా మాట్లాడితే తగిన బుద్ధి చెబుతామని గిరిజన వి ద్యార్థి సంఘం నాయకులు అదిలాబాద్ బీజేపీ ఎంపీ సోయం బాపురావును హెచ్చరించారు. స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఎంపీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అన్నదమ్ముల్లా కలిసి మెలసి ఉంటున్న కోయ, గొండు, లంబాడాలను వీడదీసేందుకు ఎంపీ రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు.



ఎంపీ సోయం బాపురావు దిష్టిబొమ్మ దహనం చేస్తున్న విద్యార్థి నాయకులు

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 – బేబి - 11.00, 6.20
ఓపెన్ హైమర్ (ఇంగ్లీష్) - 2.30
రాఖీ జౌర్ రాణీ కీ ప్రేమ్ కాహనీ (హిందీ) - 9.50
స్క్రీన్-2 – బ్రో (తెలుగు) - 10.50, 1.45, 4.40, 7.35, 10.30
స్క్రీన్-3 – బ్రో (తెలుగు) - 10.20, 1.15, 4.10, 7.05, 10.00
స్క్రీన్-4 – బ్రో (తెలుగు) - 9.10, 12.05, 6.35, 9.30
రాఖీ జౌర్ రాణీ కీ ప్రేమ్ కాహనీ (హిందీ) - 3.00